సమస్యలుంటే సాక్షికి చెప్పండి

మీ సమస్యలు, ప్రజోపయోగ సూచనలు, ఇతర అంశాలను కింద ఫోన్ నంబర్‌కు వాట్సాప్ చేయండి

90324 97123

నంబర్‌ను సంప్రదించండి

క్లుప్తంగా

ముగిసిన టేబుల్ టెన్నిస్ పోటీలు



గెలుపొందిన క్రీడాకారులు

దాబాగార్డెన్స్: విశాఖ జిల్లా టేబుల్ టెన్నిస్ సంఘం, ప్లే ఫిట్ అకాడమీ ఆధ్వర్యంలో రెండు రోజుల పాటు కృష్ణా కళాశాల సమీపాన గల ప్లే ఫిట్ అకాడమీలో నిర్వహించిన పోటీలు ఆదివారం ముగిసాయి. ముగింపు కార్యక్రమంలో అసోసియేషన్ కార్యదర్శి డాక్టర్ డీవీఎస్‌వై శర్మ పాల్గొని గెలుపొందిన క్రీడాకారులకు మెమొంటోలు అందజేశారు. కార్యక్రమంలో ప్లే ఫిట్ అకాడమీ కోచ్‌లు మురళీమోహన్ పాత్రో, గోపాల్, పవన్, జిల్లా సంఘం సభ్యులు వీఎస్ఎన్ మూర్తి, వి. ధనరాజ్, శ్రీకాంతరాజు, రవికుమార్, ఆనంద్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

నూతన నియామకం



డాక్టర్ సీతారామరాజును అభినందిస్తున్న సభ్యులు

మహారాణిపేట : గైనకాలజీ ప్రాంతీయ కేంద్రం అధ్యక్షునిగా ప్రముఖ ప్రసూతి, స్త్రీ వైద్య నిపుణులు డాక్టర్ వి.సీతారామరాజు ఎన్నికయ్యారు. ఆదివారం ఒక హోటల్లో జరిగిన కార్యవర్గ సమావేశంలో 2023–24 సంవత్సరానికి ఆయనను సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అనంతరం డాక్టర్ సీతారామరాజు అధ్యక్ష బాధ్యతలను డాక్టర్ టి.పద్మావతి నుంచి స్వీకరించారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షుని గా ఎన్నికైన డాక్టర్ సీతారామరాజును సొసైటీ సభ్యులు అభినందించారు. అనంతరం గర్భాశ య పరిరక్షణ అంశంపై ప్రసంగించారు. సమావేశంలో ఓజీఎస్‌వీ సీనియర్ సభ్యులు పాల్గొన్నారు.

ఘనంగా దశమ వార్షికోత్సవం



కల్యాణం నిర్వహిస్తున్న అర్చక స్వాములు

అల్లిపురం: కనకమహాలక్ష్మీ అమ్మవారి దేవస్థానం దత్తత దేవాలయమైన అంబికాబాగ్ సీతారామచంద్రస్వామి దేవస్థానం దశమ వార్షికోత్సవం ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా దేవస్థానం మండపంలో సీతారాముల కల్యాణోత్సవం వైభవంగా నిర్వహించారు. తెల్లవారు జామున మూలవిరాట్‌కు అభిషేకం చేశారు. సాయంత్రం జరిగిన కల్యాణోత్సవంలో ఉప కలెక్టర్, కార్యనిర్వహణాధికారి రమేష్‌నాయుడు, అధిక సంఖ్యలో కల్యాణ దంపతులు పాల్గొని ఉత్సవాన్ని తిలకించారు. అర్చక స్వాములు పానంగిపల్లి రంగనాథాచార్యులు ఆగమ శాస్త్రోక్తంగా సీతారాముల కల్యాణోత్సవం చేపట్టారు. కార్యక్రమంలో ధర్మకర్తల మండలి సభ్యులు సత్యరూపవాణి, సానబోయిన సురేష్, ఏవీ రామకృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

రంజాన్ తోఫా పంపిణీ



ముస్లింలకు రంజాన్ తోఫా అందజేస్తున్న బత్తిన నవీన్‌కుమార్

దాబాగార్డెన్స్: జీవీఎంసీ 31వ వార్డు వైఎస్సార్‌సీపీ నాయకుడు బత్తిన నవీన్‌కుమార్ ఆదివా రం వార్డు పరిధి బొడ్డునాయుడుతోట, సూర్యా బాగ్, గాజులవీధి తదితర ప్రాంతాల్లో గల ముస్లిం కుటుంబాలకు పార్టీ నాయకుడు సీతంరాజు సుధాకర్ సహకారంతో రంజాన్ తోఫా అందజేశారు. ఈ సందర్భంగా బత్తిన మాట్లాడుతూ పేదల ఆకలి గుర్తించేది పవిత్ర రంజాన్ పండగ మాసమని, ఈ పండగలో పేదల్ని సంతోషంగా ఉంచడం ప్రతి ఒక్కరి బాధ్యతగా పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎండీ వల్లీ, వల్లీభాయ్, గౌస్, జహంగీర్, యాసీన్, ఫాతిమా, నక్కా వేణు, జితేందర్, ఆర్జీ రాజేష్, శంకరరావు, యరబాల అప్పారావు, సరస్వతి, రాలి శ్రీను, కొల్లి లక్ష్మణరావు పాల్గొన్నారు.

ట్రా'ఫికర్'

- ప్రైవేట్ ట్రావెల్స్ బస్సులతో పలు ప్రాంతాల్లో ట్రాఫిక్ సమస్య
- సమయానికి గమ్యస్థానం చేరుకోలేక వాహన చోదకుల ఇక్కట్లు



ఆర్టీసీ కాంప్లెక్స్ పరిసరాలలో బారులుతీరిన ప్రైవేట్ ట్రావెల్స్ బస్సులు



సీతమ్మపేట రోడ్డులో పరిస్థితి ఇలా..

దాబాగార్డెన్స్: నగరంలో ప్రైవేట్ ట్రావెల్స్ బస్సులు ఇబ్బందులు సృష్టిస్తున్నాయి. ప్రధాన రహదారుల్లో ఇష్టానుసారం నిలిపివేయడంతో ట్రాఫిక్ సమస్యలు ఎదురవుతున్నాయి. రాత్రి ఏడు గంటలైతే చాలు.. ఆర్టీసీ కాంప్లెక్స్, ఫ్లైఓవర్ రోడ్డు, గురజాడ విగ్రహ కూడలి, బుల్లయ్య కళాశాల, గురుద్వార్, అక్కయ్యపాలెం తదితర ప్రధాన కూడళ్ల వద్ద పదుల సంఖ్యలో ప్రైవేట్ టూర్స్, ట్రావెల్స్ బస్సులు రోడ్లపై ఇష్టానుసారంగా బారులు తీరుతున్నాయి. దీంతో ఆయా ప్రాంతాల్లో ట్రాఫిక్ సమస్య దారుణంగా తయారవుతోంది. విజయవాడ, హైదరాబాద్, బెంగళూరు, చెన్నై, తిరుపతి వంటి సుదూర ప్రాంతాలకు ప్రతిరోజూ వందకు పైగా ట్రావెల్ బస్సులు నగరం నుంచి వెళ్తుంటాయి. నగరంలోని 20కి పైగా ఉన్న ట్రావెల్ సంస్థలు తమ కార్యాలయాలను ఆర్టీసీ కాంప్లెక్స్, సీతంపేట, రామాటాకీస్ ప్రాంతాల్లో నిర్వహిస్తున్నాయి. దీంతో ప్రయాణికుల పికప్ పాయింట్లు కూడా ఇక్కడే ఉండడంతో రాత్రి 7 నుంచి 11 గంటల వరకూ ప్రయాణికులు తమ లగేజీలతో వేచి ఉంటున్నారు. దీంతో ఆయా ప్రాంతాల్లో ట్రాఫిక్ సమస్య ఏర్పడుతోంది. ప్రధాన రహదారుల్లో ట్రాఫిక్ సమస్యకు కారణమవుతున్న ట్రావెల్స్ సంస్థలపై చర్యలకు పోలీసులు వెనకడుగు వేస్తున్నారు. ఇప్పటికైనా ట్రాఫిక్ పోలీసులు, ట్రాన్స్‌పోర్టు అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని పలువురు కోరుతున్నారు.

శని, ఆదివారాల్లో..

వీకెండ్(శని, ఆదివారాలు)లో పరిస్థితి మరీ దారుణంగా ఉంటుంది. రెండు రోజులు సెలవు కావడంతో ఉద్యోగులు, విద్యార్థులు వారి ప్రాంతాలకు వెళ్లేందుకు ఆర్టీసీ బస్సులు దొరకని సమయంలో ప్రైవేట్ టూర్స్, ట్రావెల్ బస్సులకు క్యూ కడుతున్నారు. దీంతో ఆయా బస్సుల పికప్ పాయింట్ల వద్ద తీవ్ర రద్దీ వాతావరణం నెలకొంటోంది.

చుక్కలు చూడాల్సిందే..



పని ఉండి సాయంత్రం వేళల్లో ఆర్టీసీ కాంప్లెక్స్ పరిసర ప్రాంతాలకు వెళ్లామంటే చుక్కలు చూడాల్సిందే. అడుగడుగునా ట్రాఫిక్ సమస్యే. ఒక సిగ్నల్ పాయింట్‌ను దాటి ముందుకు వెళ్లగానే హమ్మయ్య అనుకోవడానికి వీల్లేని పరిస్థితులు. ఒక్కో సిగ్నల్ పాయింట్ దాటాలంటే 10 నిమిషాల పైమాటే. ముఖ్యంగా సాయంత్రం వేళల్లో మామూలు ట్రాఫిక్‌తో పాటు ప్రైవేట్ ట్రావెల్స్ బస్సుల రద్దీ కూడా ఇబ్బందికరంగా ఉంటుంది. సీతమ్మపేట దుర్గా గణపతి ఆలయం వద్ద ప్రైవేట్ ట్రావెల్స్ బస్సుల హడావిడి చూస్తే అనుకున్న సమయానికి జాతీయ రహదారికి చేరుకోగలమా అనిపిస్తుంది.

చిటికిరెడ్డి పవన్‌కుమార్, ద్విచక్రవాహన చోదకుడు

రైల్వేస్టేషన్‌కు వెళ్లాలంటే..



రామాటాకీస్ నుంచి రైల్వే స్టేషన్‌కు వెళ్లాలంటే అనేక ఇబ్బందులు ఎదుర్కోవలసి వస్తోంది. ఫ్లైఓవర్ వద్ద సిగ్నల్ పాయింట్ దాటినప్పటికీ.. ద్వారకా బస్ స్టేషన్ అవుట్ గేట్ వద్ద విపరీతమైన ట్రాఫిక్ ఉంటుంది. సుదూర ప్రాంతాలకు వెళ్లే బస్సులు.. ప్రైవేట్ ట్రావెల్ బస్సులు కూడా అక్కడే నిలిపి ఉంచడంతో విపరీతమైన ట్రాఫిక్ ఉంటుంది. సమయానికి రైల్వేస్టేషన్‌కు చేరుకుని ఎక్కాల్సిన రైలును అందుకోవడం జరిగే పనేనా? అనిపిస్తుంది.

– పసగాడ రామలింగేశ్వరరావు, ద్విచక్ర వాహనచోదకుడు

బెంబేలెత్తిస్తున్న ఎండలు



నిత్యం రద్దీగా ఉండే పూర్ణామార్కెట్ ప్రధాన రహదారి ఇలా వెలవెలబోయింది



నిర్మానుష్యంగా మారిన రామకృష్ణ జంక్షన్

- నిర్మానుష్యంగా రహదారులు
- వెలవెలబోతున్న మార్కెట్లు

జగదాంబ: ఎండలు మండిపోతున్నాయి. వారం రోజులుగా ఉష్ణోగ్రతలు తారాస్థాయికి చేరుకోవడంతో ఎండ వేడిమి, ఉక్కపోతతో ప్రజలు అల్లాడుతున్నారు. బయటికి రావడానికి కూడా ఆసక్తి చూపడం లేదు. బయటి పనులపై తిరిగే వారు వడగాడ్పులకు గురై అపసోపాలు పడుతున్నారు. ఎండ వేడితో మార్కెట్లు బోసిపోతున్నాయి. నిత్యం రద్దీగా ఉండే పూర్ణామార్కెట్ సైతం వినియోగదారులు లేక బోసిపోతోంది. అలాగే రామకృష్ణ రైతుబజార్ కూడా కొనుగోలుదారులు లేక వెలవెలబోతోంది. పాత నగరంలోని రహదారులన్నీ నిర్మానుష్యంగా కనిపిస్తున్నాయి. ఆదివారం ఎండ తీవ్రత ఎక్కువగా ఉండడంతో మార్కెట్లు, రహదారులు బోసిపోయి కనిపించాయి. ఇంట్లో ఉన్నా ఉక్కపోత అలాగే ఉండడంతో వృద్ధులు, చిన్నారులు ఇబ్బందులు పడ్డారు. తప్పనిసరి పరిస్థితుల్లో బయటికి వెళ్లాల్సిన వారు ఎండ నుండి ఉపశమనం కోసం కొబ్బరి బొండాలు, శీతల పానీయాలను ఆశ్రయించడం కనిపించింది.

రూ.10 భోజనానికి.. 50 రోజులు



తక్కువ ధరకే భోజనం అందజేస్తున్న సభ్యులు

దాబాగార్డెన్స్: రాయల్ వాల్తేర్ రౌండ్ టేబుల్ 356 సంస్థ.. వివేకానంద స్వచ్ఛంద సేవా సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో ప్రభుత్వ విక్టోరియా ఆసుపత్రి వద్ద పేషెంట్ల సహాయకుల కోసం రూ.10కే భోజన కార్యక్రమం ఆదివారం 50వ రోజుకి చేరింది. ఈ సందర్భంగా సంస్థ గౌరవ అధ్యక్షుడు డాక్టర్ జహీర్ అహ్మద్ మాట్లాడుతూ ఈ భోజనం తయారు చేయడానికి (ఒక్కో ప్లేటుకి) రూ.60 పడుతుందని, దూర ప్రాంతాల నుంచి వచ్చే పేషెంట్ల సహాయకులకు తక్కువ ధరకే నాణ్యమైన భోజనం అందివ్వాలన్న దృఢ సంకల్పంతో రౌండ్ టేబుల్ సంస్థ సభ్యులు ఈ సేవా కార్యక్రమాన్ని ప్రారంభించారని అన్నారు. దాదాపు 50 రోజులుగా కేవలం రూ.10కే భోజనం అందజేయడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో రౌండ్ టేబుల్ సంస్థ చైర్మన్ మక్బూల్ అహ్మద్, సభ్యులు దీపారెడ్డి, ప్రతీక్, శశాంక్‌రెడ్డి, రవివర్మ, నిలేష్‌జైన్, శర్మజోషి, రోహిత్ కంచర్ల తదితరులు పాల్గొన్నారు.

యాసిన్‌బాబా దర్గాలో ఇఫ్తార్ విందు



ఇఫ్తార్ విందు స్వీకరిస్తున్న ముస్లింలు

అల్లిపురం: రంజాన్ మాసం సందర్భంగా ఆదివారం అల్లిపురంలోని యాతపేటలో గల యాసిన్ బాబాదర్గాలో ప్రార్థనలు చేశారు. అనంతరం ఇఫ్తార్ విందు నిర్వహించారు. షేక్ మదీనా, మహ్మద్ యాసిన్, షేక్ షిలార్, షేక్ గిలానీలు సంయుక్తంగా ఇఫ్తార్ విందు ఇచ్చారు.

రహదారిపై వ్యాపారాలు చేయరాదు



జనతాబజార్‌లో వ్యాపారులతో మాట్లాడుతున్న జెడ్సీ శివప్రసాద్

జగదాంబ: జీవీఎంసీకి ఆశీలు చెల్లించాలని జోన్–4 కమిషనర్ కె.శివప్రసాద్ అన్నారు. ఆదివారం ఆయన జోన్ పరిధిలోని జనతాబజార్, చేపల మార్కెట్‌ను తనిఖీ చేశారు. రహదారులపై వ్యాపారాలు చేయకూడదన్నారు. చేపల మార్కెట్‌కు కేటాయించిన స్థలాల్లోనే వ్యాపారాలు చేసుకోవాలన్నారు. ఎపిడిమిక్ సీజన్ కావడంతో చేపలకు ఉపయోగించిన నీరు, ఐస్ ముక్కలు, వ్యర్థాలు రహదారులపై వేయకూడదన్నారు. పరిసరాలు పరిశుభ్రంగా ఉంచాలన్నారు. ఎవరైనా నిబంధనలు ఉల్లంఘిస్తే వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. జనతాబజార్ రోడ్డు పక్కన అనధికార పార్కింగ్‌లు తొలగించాలన్నారు. వాహనాలు పెట్టిన వారిపై అపరాధ రుసుములు విధించాలన్నారు. స్క్రాప్ వాహనాలు నిలపకుండా మొదటిసారి అందరికీ నోటీసుల ద్వారా తెలియపరచాలన్నారు. అయినప్పటికీ మళ్లీ వాహనాలు పెట్టినట్టు అయితే ఆయా వాహనాలను డంపింగ్ యార్డుకు తరలించాలని ఆదేశించారు. ఫ్రూట్ మార్కెట్ బయటున్న దుకాణదారులు స్క్రాప్ వస్తువులు లోపల పెట్టుకోవాలన్నారు. సోమవారం ఉదయం వస్తువులు రోడ్డుపై ఉంటే వాటిని యార్డుకు తరలిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఏఎంహెచ్‌వో డాక్టర్ ఎన్.కిశోర్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణ, శ్రీను, సెక్రటరీలు తదతరులు పాల్గొన్నారు.

ఘనంగా సీతారాముల కల్యాణం



సీతారాముల కల్యాణంలో పాల్గొన్న పైడా కృష్ణప్రసాద్ దంపతులు

మద్దిలపాలెం: సీతారాముల కల్యాణ మహోత్సవం పైడా విద్యా సంస్థల అధినేత పైడా కృష్ణప్రసాద్, రమాదేవి ఆధ్వర్యంలో ఆదివారం బాలాజీనగర్‌లో ఘనంగా జరిగింది. రంగనాథాచార్యులు, ఎస్.సీతారామాచార్యులు, ద్వారం త్యాగరాజు బృందం కీర్తనల నడుమ కల్యాణాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పైడా కృష్ణప్రసాద్ మాట్లాడుతూ లోక కల్యాణార్థం సీతారాముల కల్యాణ మహోత్సవాన్ని జరిపించడం ఆనందంగా ఉందన్నారు.

సమస్యల పరిష్కారానికి పాదయాత్రలు



అల్లిపురం మార్కెట్‌లో ప్రచారభేరి నిర్వహిస్తున్న సీపీఐ నాయకులు

అల్లిపురం: ప్రభుత్వాలు అవలంబిస్తున్న ప్రజా, కార్మిక, రైతు వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఈ నెల 30 వరకు సీపీఐ, సీపీఎం నిర్వహించే కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి ఎం.పైడిరాజు పిలుపునిచ్చారు. ఆదివారం సాయంత్రం అల్లిపురం మార్కెట్ నుంచి కెప్టెన్ రామారావు జంక్షన్, అచ్చియ్యమ్మపేట ప్రాంతాల్లో ఇంటింటికీ వెళ్లి కరపత్రాలు పంచారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నగరంలోని సమస్యల పరిష్కారానికి వామపక్ష పార్టీలు పాదయాత్రలు నిర్వహిస్తున్నాయన్నారు. నగరాన్ని పట్టి పీడిస్తున్న కాలుష్య సమస్యను పరిష్కరించాలని, కేజీహెచ్, విమ్స్‌కి తగినన్ని నిధులు, డాక్టర్లు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు సీఎస్ క్షేత్రపాల్, జి.ఫణీంద్ర, జి.లక్ష్మణరావు, ఎం.శ్రీనివాస్, భరత్, నాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఒడియా, తెలుగు సంగమం

ఎంవీపీ కాలనీ: ఒడిశా వ్యవస్థాపక దినోత్సవాన్ని పురస్కరించుకుని బీజేపీ జిల్లా నాయకత్వం ఆధ్వర్యంలో ఒడియా, తెలుగు సంగమంను ఘనంగా నిర్వహించారు. లాసన్స్ బే కాలనీలోని పార్టీ కార్యాలయం ఆవరణలో ఆదివారం రాత్రి జరిగిన ఈ కార్యక్రమాన్ని పార్టీ జాతీయ ఉపాధ్యక్షుడు బైజయంత్ జై పాండా ముఖ్యఅతిథిగా జ్యోతి వెలిగించి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్, ఒడిశాలు అభివృద్ధి దిశగా ముందుకు సాగుతున్న రాష్ట్రాలు అన్నారు. అన్ని అంశాల్లోను ఇచ్చిపుచ్చుకొనే ధోరణితో అభివృద్ధికి ముందడుగు వేయాలన్నారు. పార్టీ జాతీయ కార్యదర్శి సునీల్ దేవధర్ మాట్లాడుతూ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలోని కేంద్ర ప్రభుత్వం ఆంధ్రా, ఒడిశా రాష్ట్రాల అభివృద్ధికి ప్రాధాన్యమిస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీ జీవీఎల్ నరసింహరావు, విష్ణుకుమార్‌రాజు, పీవీఎన్ మాధవ్, మేడపాటి రవీంద్ర, తదితరులు పాల్గొన్నారు.

సాంఘిక దురాచారాలపై కందుకూరి అలుపెరుగని పోరాటం

ఏయూ క్యాంపస్: సాంఘిక దురాచారాలపై కందుకూరి వీరేశలింగం పంతులు అలుపెరుగని పోరాటం చేశారని సమైక్యభారతి జాతీయ సమన్వయకర్త పి.కన్నయ్య అన్నారు. ఆంధ్ర విశ్వవిద్యాలయ తెలుగు విభాగం ఆధ్వర్యంలో కందుకూరి వీరేశలింగం పంతులు 175వ జయంతి వేడుకలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. తెలుగు శాఖాధిపతి ఆచార్య జర్ర అప్పారావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ముందుగా కందుకూరి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కన్నయ్య మాట్లాడుతూ సమాజం కోసం తన జీవితాన్ని త్యాగం చేసిన మహోన్నత వ్యక్తి కందుకూరి అని కొనియాడారు. ఆత్మీయ అతిథి ఆచార్య జి.యోహాన్‌బాబు మాట్లాడుతూ సమాజ ఉద్ధరణకు రచనను ఆయుధంగా మార్చుకుని అనేక సాహిత్య ప్రక్రియల్లో కందుకూరి సృజనాత్మక రచనలు చేశారన్నారు. ప్రత్యేక అతిథి ఆచార్య వెలమల సిమ్మన్న మాట్లాడుతూ కందుకూరి ఆధునిక యుగకర్త అని, తాను నమ్మిన సిద్ధాంతానికి కట్టుబడిన మహోన్నతుడని చెప్పారు.

జోరుగా 'జగనన్నే మా భవిష్యత్తు'



ఇంటింటా ప్రచారం చేస్తున్న కార్పొరేటర్ తోట పద్మావతి, కన్వీనర్ రమణ తదితరులు



రామజోగిపేటలో ప్రచారం చేస్తున్న క్లస్టర్ ఇన్‌చార్జి పీతల వాసు తదితరులు

అల్లిపురం: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో 34వ వార్డు పరిధి కొబ్బరితోటలో 'జగనన్నే మా భవిష్యత్తు' కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. వార్డు కార్పొరేటర్ తోట పద్మావతి ఆధ్వర్యంలో ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ పథకాలను ప్రతి ఒక్కరికి అందజేయాలనే ఉద్దేశంతోనే ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి పని చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కన్వీనర్ లండా రమణ, వార్డు నాయకుడు లింగం శ్రీనివాసరావు, గృహసారథులు గురుమూర్తి, నర్సింగరావు, గరికిన లక్ష్మణరావు, గంటా రాజు, వలంటీర్ దయాకర్ పాల్గొన్నారు.

పలు వార్డుల్లో..

దాబాగార్డెన్స్: ఆదివారం నియోజకవర్గ పరిధి పలు వార్డుల్లో క్లస్టర్ ఇన్‌చార్జిలు, వార్డు కార్పొరేటర్లు, అధ్యక్షుల నేతృత్వంలో మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమం నిర్వహించారు. ఇంటి గోడలకు స్టిక్కర్లు అంటించారు. జీవీఎంసీ 29వ వార్డు క్లస్టర్–4 ఇన్‌చార్జి పీతల వాసు నేతృత్వంలో రామజోగిపేట సచివాలయం 178 పరిధిలో కన్వీనర్లు, గృహసారథులు, వలంటీర్లతో కలిసి ఇంటింటికి వెళ్లి స్టిక్కర్లు అంటించారు. ప్రభుత్వ సంక్షేమ ఫలాలు వివరించారు. కార్యక్రమంలో కోరాడ సురేష్, అడపా శివ, తమ్మిన శ్రీను, గృహసారథులు చెల్లారావు, దువ్వి సునీత, అన్నపూర్ణ, బంధం అనురాధ వలంటీర్లు పాల్గొన్నారు.

ప్రభుత్వ రంగ సంస్థలను కాపాడుకుందాం



దీక్షలో పాల్గొన్న కార్మిక నాయకులు



జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

సీతమ్మధార : ప్రజలకు అన్ని విధాలా సేవలందించి ఆదుకుంటున్న ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేట్ పరం కాకుండా రక్షించుకోవాలని అఖిలపక్ష కార్మిక సంఘాల జేఏసీ వైస్ ప్రెసిడెంట్ పడాల రమణ పిలుపునిచ్చారు. జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా అఖిలపక్ష కార్మిక సంఘాల ఆధ్వర్యంలో జరుగుతున్న నిరాహార దీక్షలు 748వ రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ రంగ సంస్థలు లక్షలాది మందికి ఉద్యోగాలు, ఉపాధి కల్పించడమే కాకుండా ప్రకృతి వైపరీత్యాలు వచ్చినప్పుడు ప్రజలకు అండగా నిలుస్తున్నాయన్నారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఏప్రిల్ 17వ తేదీన రాష్ట్ర వ్యాప్తంగా ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా దిష్టిబొమ్మల దగ్ధం కార్యక్రమంలో కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొని ప్రభుత్వాలకు కళ్లు తెరిపించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ రాష్ట్ర వర్కింగ్ కమిటీ సభ్యులు జి. వామనమూర్తి, తెడ్డు వెంకటేశ్వరరావు, కోట సత్తిబాబు, సత్యనారాయణ, కోట ఆనంద్, దుర్గారావు, రావి అశోక్, లావణ్య తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ నిరసన

సీతమ్మధార : స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా ఆదివారం సాయంత్రం బీఆర్ఎస్ ఆధ్వర్యంలో జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా నాయకుడు జగన్ మురారీ మాట్లాడుతూ విశాఖ ఉక్కు ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కేంద్ర ప్రభుత్వంపై గత రెండేళ్లుగా కార్మిక సంఘాలు పోరాడుతుంటే, ఆంధ్ర ప్రదేశ్ బీజేపీ నాయకులు మాత్రం కార్మికులకు మద్దతు ప్రకటించలేదని ఆరోపించారు. బీజేపీ రాజ్యసభ సభ్యుడు జీవీఎల్ నరసింహారావు, విశాఖ పార్లమెంట్ సభ్యుడు ఎంవీవీ సత్యనారాయణ పార్లమెంట్‌లో పోరాడాలని డిమాండ్ చేశారు. ఉప్పలూరి సత్య నిశ్చల్, నొల్లు నాగరాజు, మాడుతూరి వెంకటేష్, సొండి కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

నేడు, రేపు నీలమ్మ జాతర మహోత్సవాలు



నీలమ్మ అమ్మవారు

దాబాగార్డెన్స్: ఏవీఎన్ కాలేజీ డౌన్‌రోడ్డు వెలంపేట పువ్వులసందులో వెలసిన నీలమ్మ జాతర మహోత్సవాలు ఈ నెల 17, 18 తేదీల్లో అత్యంత వైభవంగా నిర్వహించనున్నారు. ఉత్సవాల్లో భాగంగా ఆదివారం లక్ష్మీ గణపతి, షిర్డీసాయి అభిషేక పూజ నిర్వహించిన అనంతరం ఉదయం 9 గంటలకు నీలిజెండా(రాట కార్యక్రమం) ఎగురవేశారు. సాయంత్రం భైతో భజన కార్యక్రమం చేపట్టారు. 17న సోమవారం తొలేళ్ల ఉత్సవాన్ని పురస్కరించుకుని ఉదయం 6 గంటల నుంచి ప్రత్యేక పూజలు జరపనున్నారు. సాయంత్రం 7 గంటల నుంచి రోషన్ లాల్ ఆర్కెస్ట్రా తదితర సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. 18న మంగళవారం జాతర సందర్భంగా ఉదయం 5 గంటల నుంచే అమ్మవారికి విశేష పూజలు, పంచామృతాభిషేకాలు జరపనున్నారు. సాయంత్రం 6.30 నుంచి జాతర నిర్వహించనున్నారు. పెద్ద ఎత్తున బాణసంచా కాల్చనున్నారు. ఉత్సవంలో భాగంగా మే ఒకటిన నీలమ్మ ఆలయం వద్ద మధ్యాహ్నం 12 గంటల నుంచి మహాన్నదాన కార్యక్రమం చేపట్టనున్నట్టు నీలమ్మ అమ్మవారి సేవా సంఘం ప్రతినిధులు తెలిపారు.

అగ్ని ప్రమాదాలపై అవగాహన



గ్యాస్ సిలిండర్‌కు మంటలు వ్యాపిస్తే ఎలా ఆర్పాలో వివరిస్తున్న అగ్నిమాపక సిబ్బంది

అల్లిపురం: వారోత్సవాల మూడవ రోజు కార్యక్రమాల్లో భాగంగా ప్రమాదాలను ఎలా ఎదుర్కోవాలో ప్రజలకు అవగాహన కల్పించారు అగ్నిమాపక శాఖాధికారులు. దాబాగార్డెన్స్‌లోని గణేష్ అపార్ట్‌మెంట్ వాసులతో పాటు స్థానికులకు కరపత్రాల ద్వారా వివరించారు. తరచూ గ్యాస్ సిలిండర్‌కు మంటలు వ్యాపించి ప్రమాదాలు చోటు చేసుకుంటున్న వార్తలపై మాక్‌డ్రిల్ చేపట్టి నివారణపై వివరించారు. గ్యాస్ సిలండర్‌కు మంటలు అంటుకున్నప్పుడు వాటిని గోనెలు లేదా కంబలి వంటివి ఉపయోగించి మంటలను అదుపు చేయడం ఎలాగో గృహిణులకు వివరించారు. జిల్లా సహాయక అగ్నిమాపక అధికారి ఆర్.వి.రమణ, లీడింగ్ ఫైర్‌మెన్ కె.కృష్ణప్రసాద్, డ్రైవర్ కమ్ ఆపరేటర్ పి.రవికుమార్, ఫైర్‌మెన్‌లు రామ్‌కుమార్, కె.పైడిరాజు, సీహెచ్ కాసుబాబు పాల్గొన్నారు.

మద్యం మత్తులో స్నేహితుల మధ్య గొడవ

అల్లిపురం: మద్యం మత్తులో ఇద్దరు స్నేహితుల మధ్య మాట మాట పెరిగి కొట్టుకున్న ఘటన ఆదివారం సాయంత్రం అల్లిపురంలోని సింహాలదేవిడి వద్ద చోటు చేసుకుంది. ఈ క్రమంలో ఇద్దరికీ దెబ్బలు తగలటంతో అపస్మారక స్థితిలో వున్న వారిని స్థానికులు కేజీహెచ్‌కు తరలించారు. విషయం తెలుసుకున్న టూటౌన్ ఏఎస్ఐ తులసీరావు ఘటనా స్థలానికి వెళ్లి దర్యాప్తు చేపట్టారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం సింహాలదేవిడికి చెందిన సురేంద్ర, వంశీ స్నేహితులు. వీరిద్దరు కలిసి మద్యం సేవించారు. మత్తులో మాటామాట పెరిగి కొట్టుకున్నారు. ఈ క్రమంలో వారికి గాయాలు కావటంతో అపస్మారక స్థితి చేరుకోగా కేజీహెచ్‌లో చికిత్స పొందుతున్నారు. వారికి ఎటువంటి ప్రాణాపాయం లేదని వైద్యులు తెలియజేసినట్లు పోలీసులు తెలిపారు. కేసు దర్యాప్తు చేస్తున్నామన్నారు.

IndusInd Bank - CFD
COMMERCIAL VEHICLES FOR SALE
1) MAHINDRA 475 DI BP MKM OIB WL LT WITH BS3A ENGINE AP39 EX 7568
2) MAHINDRA 475 DI BP MKM OIB LT POTATO BS3A ENGINE AP31 DE 9591
Cell : 70938 90249
3rd Floor, Sri Venkata Kameswari Complex, Near Vijaya Harsha Mother & Child Hospital, SRIKAKULAM.

సాక్షి
మీరు సాక్షి చందాదారులుగా చేరదలుచుకున్నారా!
లేదా మీకు పేపరు అందటంలో ఇబ్బందులు ఎదురవుతున్నాయా!
సంప్రదించవలసిన నెంబరు
వైజాగ్ సౌత్
7997958342, 9912440606

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
వైజాగ్ సౌత్
9010196663
Office mail : sakshiadvtvsp@gmail.com